# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

మంగళవారం 30 09 2025

సంపుటి 1 సంచిక 152

పేజీలు : 03

UDYAM / TS-09-0148996




తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి, ఊరూ వాడా ఏకమై ఆటా పాటలతో గౌరమ్మను కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే మన బతుకమ్మ పండుగ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుతున్న రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి సతీమణి ముకుందమ్మ, టిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ప్రశాంత్ రెడ్డి (బంటి) సతీమణి మౌనికలు.

# లోకల్ పోరు షురూ..

## స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

వివరాలు 3లో

# గిన్నిస్ బుక్‌లోకి బతుకమ్మ సంబరాలు

**గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం 10 వేల మందితో బతుకమ్మ వేడుక.**

**66.5 అడుగుల భారీ బతుకమ్మ చుట్టూ ఒకేసారి 1,354 మంది బతుకమ్మ ఆడి మరో గిన్నిస్ రికార్డు.**

హైదరాబాద్: బతుకమ్మ సంబరాలు రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌ను సాధించి చరిత్ర సృష్టించాయి. హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో మహా బతుకమ్మ కార్యక్రమాన్ని అధికారులు వైభవంగా నిర్వహించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌కోసం 10వేలమందితోబతుకమ్మవేడుకనుఅధికారులు చేపట్టారు. ఈ నేపథ్యంలో మహా బతుకమ్మ కార్యక్రమం ఏకంగా రెండు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకుంది. అతిపెద్ద జానపద నృత్యంగా తెలంగాణ బతుకమ్మ ఒక గిన్నిస్ రికార్డు సాధించింది. మరో రికార్డుగా 66.5 అడుగుల భారీ బతుకమ్మ చుట్టూ ఒకేసారి 1,354 మంది మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆడి మరో గిన్నిస్ రికార్డు క్రియేట్ చేశారు. ఈ మేరకు తెలంగాణ బతుకమ్మ వేడుకకు 2 గిన్నిస్ రికార్డులు దక్కాయి. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి బతుకమ్మ వేడుక నమోదైంది. పది వేల మంది మహిళలు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ.. పాటలు పాడుతుండగా గిన్నిస్ బుక్ ప్రతినిధులు వివరాలను నమోదు చేసుకుని ఫలితాన్ని ప్రకటించారు. ఒకేసారి పది వేల మందితో బతుకమ్మ ఆడించి గిన్నిస్ రికార్డుల్లో స్థానం దక్కించుకోవడమే లక్ష్యంగా మహా బతుకమ్మ కార్యక్రమం కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఈ మేరకు అధికారుల అంచనాలను మించి మహా బత్తుకమ్మ రెండు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుంది.



# పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి : మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**దశ, ఇబ్రహీం పట్నం :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి , రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ , యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటి) పాల్గొని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేసేలా నాయకులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు ప్రతి కార్యకర్త ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. "పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడమే కాకుండా, గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. ప్రజల మద్దతు పార్టీకి బలంగా ఉందని, అయితే ప్రతి నాయకుడు క్రమశిక్షణతో పనిచేయడం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించడం కోసం సమగ్ర వ్యూహంతో ముందుకు సాగాలని, ప్రతి గ్రామంలో పార్టీ బలాన్ని మరింత పెంచాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. రాబోయే ఎన్నికలు పార్టీ భవిష్యత్తుకు కీలకమని, ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.







# ఘనంగా సదుల బతుకమ్మ సంబరాలు

**దశ, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలలో సోమవారం ఘనంగా సదుల బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. మహిళలు చిన్నారులు సాంప్రదాయ దుస్తులను ధరించి లయబద్ధంగా బతుకమ్మను పేర్చి సంబరాలు జరుపుకున్నారు. బతుకమ్మలను ఆయా ప్రాంతాలలోని కాలనీలలో మహిళలు సంబురంగా బతుకమ్మను జరుపుకున్నారు. కాగా కొన్ని ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలు మంగళవారం కూడా నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు.



పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలో...



నల్గొండ జిల్లా , మిర్యాలగూడ బంగారి గడ్డలో ...

## చింతపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

# ముగ్గురు మృతి

**దశ, నల్గొండ:** నల్గొండ జిల్లా చింతపల్లి మండలం నసర్లపల్లి గేటు వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై ఆటో, కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని అత్యవసర చికిత్స కోసం దేవరకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతులు దేవరకొండ మండలం మటిక తండాకు చెందిన రాత్లావత్ భాస్కర్ (29), రాత్లావత్ వినోద్ (29), సఫవత్ రవి (29)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

# ఆర్టీసీ నూతన ఎండీగా నాగిరెడ్డి బాధ్యతలు

**దశ, హైద్రాబాద్:**

ఆర్టీసీ నూతన మేనేజింగ్ డైరెక్టర్ గా ఐపీఎస్ అధికారి వై నాగిరెడ్డి బాధ్య తలు స్వీకరించారు. ప్రస్తుతం ఆర్టీసీ ఎండీగా సేవలందించిన సజ్జనారు హైదరాబాద్ సీపీగా బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న నాగిరెడ్డిని ఆర్టీసీ ఎండీగా ప్రభుత్వం తాజాగా నియమించింది. దీంతో ఆర్టీసీ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు నేడు చివరి రోజు కావటంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. సాధారణ వ్యక్తిలా ప్రయాణించారు



దశ
నిజం.. నిర్భయంగా..

02
మంగళవారం
30-9-2025
WWW.
DASHANEWS
.COM




# నడకతో ఆరోగ్యం పదిలం: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**దశ, ఎల్బీనగర్:** ప్రతి రోజూ ఉదయం పూట నడిచే నడకతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సోమవారం నిర్వహించిన 5కే వాక్ ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతిరోజు వ్యాయాయం చేసి, గుండెను కాపాడుకోవాలన్నారు. ఇటీవల కాలంలో చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికి గుండెపోటు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ సాధారణ మోతాదులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓజోన్ దవాఖాన డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీపీ పదవి ఆ గ్రామాలకే

**దశ, ఆమనగల్లు :** స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఆసక్తికరంగా మారడంతో కడ్తాల్ మండల పార్టీల నాయకులు బడా లీడర్ల ఆశలు సన్నగిలాయి. జిల్లా ప్రజా పరిషత్ ( జడ్పిటిసి) మహిళా బీసీ, మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) మహిళ జనరల్ కు రిజర్వ్ కావడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న మండల స్థాయి నాయకులు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. మహిళలకు పెద్దపీట వేయడంతో అగ్ర నాయకులు తమ భార్యలను పోటీల్లో గెలిపించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కడ్తాల్ మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఎంపీపీ పదవి మహిళా జనరల్ కు రిజర్వ్ కావడంతో జనరల్ మహిళకు కేటాయించిన ఎంపీటీసీల స్థానాలపై అందరి దృష్టి నెలకొంది. కడ్తాల్లో రెండు ఎంపీటీసీలు, ఒకటి మహిళా ఎస్సీ, మరొకటి మహిళా ఎస్టీ, కర్కల్ పహాడ్ మహిళా బీసీ, రావిచేడు మహిళా బీసీ, మైసిగండి జనరల్ గా కేటాయించడంతో ఆ గ్రామాల ఎంపీటీసీ అభ్యర్థులకు ఎంపీపీ పదవి దక్కుతుందని చర్చ జరుగుతోంది. ఈ ఐదు గ్రామాల్లో ఎంపీటీసీలకు పోటీ చేసే అభ్యర్థులకు వివిధ పార్టీల్లో పెరుగుతున్న కారణంగా రోజు రోజుకు చర్చ విపరీతంగా సాగుతోంది.

# కోలివింగ్ హాస్టల్స్ చుట్టూ కండోమ్స్ వరద

❖ *ఇంత స్థాయిలో బయటికి వచ్చాయంటే ఎంత కరువులో ఉన్నారో..*



**దశ, హైదరాబాద్:** వర్షం పడితే పాత వాతలు తేలుతాయని ఓ సామెత. ఆ సామెత ఎలా పుట్టిందో తెలియదు కానీ.. ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్న వీడియో మాత్రం ఆ సామెతను నూటికి నూరు శాతం నిజం అని నిరూపిస్తోంది. ఆ వీడియోలో చూసిన దృశ్యాలు.. మామూలుగా లేవు. చూస్తుంటేనే వెన్నులో వణుకు పుడుతుంది. జనం ఇంత కరువులో ఉన్నారా.. తమ కరువు తీర్చుకోవడానికి ఇంతలా తాపత్రయపడుతున్నారా.. అని అనిపిస్తోంది. ఆ మధ్య గుంటూరులో వర్షం పడితే వాడి పడేసిన కండోమ్ లు రోడ్డుమీదికి ప్రవాహ మాదిరిగా వచ్చాయి. వర్షపు నీటికి అవన్నీ కొట్టుకొని వచ్చి రోడ్డుమీద పేరుకుపోయాయి. ఆ ప్రాంతంలో లాడ్జీలు, హోటల్లు అధికంగా ఉండడంతో ఇవన్నీ బయటపడ్డాయని తెలిసింది. గుంటూరులో జరిగిన సంఘటన మర్చిపోకముందే హైదరాబాదులో కృష్ణానగర్ ప్రాంతంలో వర్షపు నీటికి కండోమ్ ప్యాకెట్లు వెల్లువలా వచ్చాయి.

దానికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. కృష్ణ నగర్ ప్రాంతంలో ఎక్కువగా సినీ ఆర్టిస్టులు ఉంటారు. చాలామంది అవకాశాల కోసం ప్రొడక్షన్ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఇక్కడ హోటళ్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. లాడ్జిల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో కో లివింగ్ హాస్టల్స్ కూడా ఏర్పాటయ్యాయి. ఐటి కంపెనీలలో పని చేసే ఉద్యోగులు ఇక్కడే ఉంటున్నారు. ఇక్కడ నుంచి మాదాపూర్, మియాపూర్, ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వాళ్లంతా ఇక్కడ ఉంటున్నారు. వారంతా కూడా కో లివింగ్ హాస్టల్స్ లో ఆశ్రయం పొందుతున్నారు.

కో లివింగ్ హాస్టల్ అంటే పెళ్ళి కాకుండానే ఆడ మగ కలిసి ఉండటం.. అవసరమైతే కలిసి పడుకోవడం.. ఇవన్నీ సౌలభ్యాలు ఉన్నాయి కాబట్టే కండోమ్ ప్యాకెట్లను దండిగా వాడుతున్నారు. ఆ తర్వాత వాటిని పడేస్తున్నారు. వర్షం విపరీతంగా కురవడంతో.. వచ్చిన వరదకు ఆ ప్యాకెట్లు రోడ్డు మీద పేరుకుపోయాయి. ఈ దృశ్యాలను చూసి చాలామంది ఆశ్చర్యపోతున్నారు.." ఇంటికి దూరంగా ఉంటున్నారు. ఒంటి సాంగత్యం కోసం కండోమ్ ప్యాకెట్లు వాడుతున్నారు. ఇంత స్థాయిలో బయటికి వచ్చాయంటే ఎంత కరువులో ఉన్నారో.. బాబాయ్ చూస్తుంటేనే ఒకరకంగా ఉందని" స్థానికులు చర్చించుకుంటున్నారు.

# సరస్వతీ దేవీ అలంకరణలో అమ్మవారు



**దౌల్తాబాద్, దశ:** సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా ఘనంగా అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా 8వ రోజు సర్వస్వతీ దేవీ అలంకరణలో అమ్మావారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని మూభారస్‌పూర్ గ్రామంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన మండపం ఆవరణంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. అంతే కాకుండ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేసిన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ వేడుకలో గ్రామస్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

# పసుమాములలో ఘనంగా బతుకమ్మ, దాండియా



**దశ, పెద్ద అంబర్ పేట:** శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పసుమాముల గాంధీ విగ్రహం వద్ద దుర్గమాత ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారిని 7వ రోజు ఆదివారం శ్రీ మహా చండి దేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలంగాణ సంస్కృతి సాంప్రదాయమైన రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద ఎత్తున హాజరై బతుకమ్మ, దాండియా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉత్సాహంగా ఆడి పాడారు. వృద్ధ మహిళలు ఆలపించిన బతుకమ్మ పాటలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గమాత ఉత్సవ కమిటి అధ్యక్షులు వడ్డేపల్లి స్వామి గౌడ్, సభ్యులు, దాతలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# కష్టాల నుండి కిరీటం వరకు ఆది దీక్షిత ప్రయాణం



**దౌల్తాబాద్, దశ:** ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆది దీక్షిత డీఎస్పీగా ఎంపిక కావడం విశేషం. ఈ విజయం కేవలం వ్యక్తిగత ప్రతిభ మాత్రమే కాకుండా కుటుంబం, గురువులు, గ్రామం కలసి గర్వపడే ఘట్టం. మధ్య తరగతి కుటుంబం - మహా విజయ లక్ష్యం. దీక్షిత చిన్ననాటి నుంచే మధ్య తరగతి కుటుంబంలో పెరిగింది. తండ్రి ఆది వెంకన్న, తల్లి ఆది రేఖ వ్యవసాయం చేసుకుంటూ కష్టపడి జీవనం సాగించారు. కానీ తమ కూతురు చదువులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలగన్నారు.ఆ కలను నిజం చేయడమే తన ధ్యేయంగా భావించారు.

**వివేకానంద పాఠశాలలో పునాది**

స్థానికంగా ఉన్న వివేకానంద పాఠశాలలోనే దీక్షిత తన విద్యాభ్యాసాన్ని చేశారు. అక్కడి గురువుల మార్గదర్శకత, క్రమశిక్షణ, సమయపాలన తనకు పునాది వేసింది. పాఠశాల రోజుల్లోనే "జీవితంలో పెద్దదిగా ఆలోచించాలి, కష్టపడాలి" అనే విలువలు తనలో నాటుకుపోయాయి.

**ప్రయత్నం.. పట్టుదల.. విజయం**

గ్రూప్-1 పరీక్షలకు సన్నద్ధమవడం చిన్న విషయం కాదు. రోజంతా చదువులో మునిగిపోవడం, వైఫల్యాలను తట్టుకోవడం, మళ్లీ కొత్త ఉత్సాహంతో ముందుకు సాగడం దీక్షిత అలవాటు చేసుకుంది. ఒకవైపు కుటుంబ పరిస్థితులు కష్టంగా ఉన్నా, మరోవైపు ఆశయానికి కట్టుబడి చదువుతోనే తన భవిష్యత్తును నిర్మించుకున్నది. చివరికి డీఎస్పీ ఉద్యోగం సాధించడం తన పట్టుదలకు నిదర్శనం.

**యువతకు ఆదర్శం...**

ఈ విజయంతో దీక్షిత, దౌల్తాబాద్ యువతకు ఆదర్శంగా నిలిచింది. "కష్టానికి ఫలితం తప్పక ఉంటుంది" అనే నమ్మకాన్ని తన జీవితంతో నిరూపించింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కలలు కంటున్న అనేక మంది యువతకు దీక్షిత ప్రయాణం ప్రేరణగా మారింది. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఒక సాధారణ యువతి కష్టంతో, పట్టుదలతో, తల్లిదండ్రుల ఆశీర్వాదంతో డీఎస్పీ స్థాయి వరకు చేరుకోవడం నిజంగా విశేషం. దౌల్తాబాద్ పేరు వెలుగులోకి తీసుకొచ్చిన ఆది దీక్షితకు భవిష్యత్తు మరింత వెలుగొందాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

# శ్రీ సంతోషిమాత దేవాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక పూజలు



**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హనుమంత రెడ్డి శ్రీ సంతోషిమాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయన వెంట డి ఈ.వెంకటసత్య రావు,జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ దేవాలయ ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి మురళీధర్, అధ్యక్షులు పబ్బా ప్రకాశరావు, బెలిదే అశోక్, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య గోపారపు రాజు, దేవరశెట్టి సోమయ్య, అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ, అశోక్ మిశ్రా, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధంకండి: సిపిఐ



**దశ సూర్యాపేట ప్రతినిధి :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచేందుకు కావలసిన వ్యూహాన్ని రచించుకోవాలని కలిసి వచ్చే రాజకీయ శక్తులతో ఫ్రంట్ గా ఏర్పడి స్థానికల ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మ బిక్షం భవన్ లో జరిగిన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునేందుకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అలాగే కలిసి వచ్చి శక్తులతో ముందుకు సాగాలని తద్వారా పార్టీ బలోపేతానికి బలమైన ప్రయత్నాలు చేయాలని ఎంపీటీసీ, జడ్పిటిసి మరియు సర్పంచ్ ఎన్నికల్లో సాధ్యమైన ఎక్కువ కేంద్రాలలో పోటీ చేసి పార్టీ యొక్క విస్తరణలో భాగంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశానికి బద్దం కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, ధూళిపాళ ధనుంజయ నాయుడు, యల్లంల యాదగిరి, మేకల శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, పోకల వెంకటేశ్వర్లు, ఎస్కే లతీఫ్, బూర వెంకటేశ్వర్లు, సాయబెల్లి, దేవరం మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుత సమాజంలో ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరం

❖ **డిఎస్పి ప్రసన్న కుమార్**



**దశ సూర్యాపేట ప్రతినిధి :** ప్రస్తుత సమాజంలో బాల బాలికలకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని ఇది ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ అన్నారు. సుమన్ షోటో ఖాన్ కరాటే స్పోర్ట్స్ డూ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ జే.వి. రమణచే శిక్షణ పొందిన కరాటే విద్యార్థులకు సోమవారం స్థానిక బేబీ మూన్ పాఠశాలలో బెల్టులు ప్రశంస పత్రాలు అందజేసి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలు చెడు మార్గంలో పయనించకుండా కరాటే తో పాటు ఇతర కార్యక్రమాల్లో శిక్షణ ఇప్పించడం ఎంతో అవసరం అన్నారు. కరాటే మాస్టర్ చిన్న ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచడంతో పాటు నేడు శిక్షణ పూర్తి చేసుకొని బెల్టులు అందుకోవడం అభినందనీయమన్నారు. డాక్టర్ రామ్మూర్తి యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ కరాటే విద్యార్థిని విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. కరాటే శిక్షణ ప్రశంస పత్రాలతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. బాలబాలికలకు కరాటే పోటీల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఇతర పోటీల్లో పాల్గొనేలా చేసి వారి ప్రతిభకు పదును పెడుతున్న కరాటే మాస్టర్ చిన్నాను అభినందించారు. అనంతరం కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు బ్రౌన్ 6, బ్లూ 4, ఆరంజ్ 8, గ్రీన్ 6, ఎల్లో బెల్ట్ లు ఒకటి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ చిన్నతో పాటు కరాటే మాస్టర్లు ఆర్.సంతోష్, రిషికేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్ మెట్ జె ఎన్నారం కాలనీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో మూలా నక్షత్రం రోజున సరస్వతి అవతారాన్ని విశేషంగా జరుపుకునే సందర్భంలో మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి ప్రవల్లిక దంపతులు, వెంకటేష్ కావ్య దంపతులు శివ పార్వతి కళ్యాణ మహోత్సవం అత్యంత భక్తి భావంతో, అంగరంగ వైభావంగా నిర్వహించారు.
-(దశ, అబ్దుల్లాపూర్ మెట్ )

# గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలను తీరొక్క పూలతో పేర్చి సోమవారం తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబిమించే విధంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా పూలతో గౌరీ దేవిని పూజించే సంప్రదాయం తెలంగాణ రాష్ట్రం లో ఉందన్నారు. మన సాంప్రదాయాన్ని భావితరాలకు అందించే విధంగా కృషి చేయాలన్నారు. బతుకమ్మను మన ఇంటి దేవతగా పూజించే సాంప్రదాయం ఆనాదిగా వస్తుందని చెప్పారు.మహిళలు ఆడుతూ పాడుతూ నిర్వహించే బతుకమ్మతో ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయత, అనురాగం, ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో 14వ వార్డు మాజీ కౌన్సిలర్ లు గోదాల భారతమ్మ రంగారెడ్డి, పగిళ్ల సుమిల, తంగెళ్ల సంగీత, ఎడ్ల విజయకుమారి, వల్లపు మంజుల, గొట్టెముక్కల సమత, ఉమారాణి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లోకల్ పోరు షురూ..

**మూడు విడతల్లో పంచాయితీలు..**
**రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలు.**
**సోమవారం నుంచే అమలులోకి ఎన్నికల కోడ్.**

మంగళవారం | 30-9-2025

దశ
ఎక్స్‌క్లూజివ్



**దశ, హైదరాబాద్**

తెలంగాణలో స్థానిక ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. పంచాయతీరాజ్‌శాఖ నుంచి రిజర్వేషన్ల సమాచారం అందడంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయింది. హైకోర్టు ఆదేశాలతో ఎన్నికలకు న్యాయపరమైన ఆటంకాలు లేకుండా విస్తృతస్థాయిలో చర్చించిన తరువాత సోమవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఎలక్షన్ కోడ్ సోమవారం నుంచే అమల్లోకి వస్తుందని అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. 5749 ఎంపీటీసీ, 565 జడ్పీజీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎంపీటీసీలకు 15302 , 31 వేల 377 పోలింగ్ బూత్ లు ఏర్పాటు, 12733 గ్రామ సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేశారు.

### అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్.

రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే విధంగా మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నామని ఎన్నికల కమిషనర్ తెలిపారు. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాత వార్డులు, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 9వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. అదేరోజు నామినేషన్లు ప్రారంభం అవుతాయని ఈసీ తెలిపారు. మొత్తం 5 ఫేజ్ లుగా ఎన్నికలు జరుగుతాయి. అక్టోబర్ 23న ఎన్నికలు, రెండో ఫేజ్ 27న ఎన్నికలు నిర్వహించనున్నారు.

### ముఖ్యమైన తేదీలివే..

గ్రామ పంచాయతీలకు ఫేజ్ 1 అక్టోబర్ 17న నామినేషన్లు ప్రారంభం కాగా, ఎన్నికలు అక్టోబర్ 31న జరగనున్నాయి. అదే రోజు ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. రెండో ఫేజ్ 21న నామినేషన్లు ప్రారంభం కాగా, నవంబర్ 4న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. మూడో ఫేజ్ అక్టోబర్ 25న నామినేషన్లు మొదలుకాగా, నవంబర్ 8న ఎన్నికలు నిర్వహించి, ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. నవంబర్ 11న ఎన్నికల ప్రక్రియ ముగియనుందని ఈసీ తెలిపారు.

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ - ఫేజ్ 1**
అక్టోబర్ 9 ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్
అక్టోబర్ 9 అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం
అక్టోబర్ 11 నామినేషన్ల దాఖలు తుది గడువు
అక్టోబర్ 12 నామినేషన్ల పరిశీలన
అక్టోబర్ 15 నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు
అక్టోబర్ 23 ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు తొలివిడత ఎన్నికలు
నవంబర్ 11 ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటన.

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ - ఫేజ్ 2.**
అక్టోబర్ 13 ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్
అక్టోబర్ 13 అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం
అక్టోబర్ 15 నామినేషన్ల దాఖలు తుది గడువు
అక్టోబర్ 16 నామినేషన్ల పరిశీలన
అక్టోబర్ 19 నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు
అక్టోబర్ 27 ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రెండో విడత ఎన్నికలు
నవంబర్ 11 ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటన.

**గ్రామ సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ - ఫేజ్ 1**
అక్టోబర్ 17 గ్రామ సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్
అక్టోబర్ 17 అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం
అక్టోబర్ 19 నామినేషన్ల దాఖలు తుది గడువు
అక్టోబర్ 20 నామినేషన్ల పరిశీలన
అక్టోబర్ 23 నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు
అక్టోబర్ 23 సర్పంచ్ స్థానాలకు అభ్యర్థుల జాబితా
అక్టోబర్ 31 ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటన.

**గ్రామ సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ - ఫేజ్ 2.**
అక్టోబర్ 21 గ్రామ సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్
అక్టోబర్ 21 అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం
అక్టోబర్ 23 నామినేషన్ల దాఖలు తుది గడువు
అక్టోబర్ 24 నామినేషన్ల పరిశీలన
అక్టోబర్ 27 నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు
అక్టోబర్ 27 సర్పంచ్ ఎన్నికలు రెండో విడత అభ్యర్థుల జాబితా
నవంబర్ 4 ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటన

**గ్రామ సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ - ఫేజ్ 3.**
అక్టోబర్ 25 గ్రామ సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్
అక్టోబర్ 25 అదే రోజు నుంచి నామినేషన్లు ప్రారంభం
అక్టోబర్ 27 నామినేషన్ల దాఖలు తుది గడువు
అక్టోబర్ 28 నామినేషన్ల పరిశీలన
అక్టోబర్ 31 నామినేషన్ల ఉపసంహరణ తుది గడువు
అక్టోబర్ 31 సర్పంచ్ ఎన్నికలు మూడో విడత అభ్యర్థుల జాబితా
నవంబర్ 8 ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, ఫలితాలు ప్రకటన




## స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం: కేటీఆర్



**దశ, హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎన్నికలు ఏవైనా తమ పార్టీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటుందని చెప్పారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఏ ఎన్నికైనా తమకు అనుకూలమే అని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు మర్చిపోయారని అనుకుంటోంది. వారి గ్యారంటీ కార్డులను గుర్తుచేసేందుకు, మేము బాకీ కార్డులను, తీసుకువచ్చాం. వీటిద్వారా ఆ పార్టీ బాకీలను ఇంటింటికీ చేర్చడానికి ఉద్యమించాం. బాకీ కార్డులు ఇంటింటికి తీసుకుపోతే, అదే కాంగ్రెస్ పాలిట బ్రహ్మాస్త్రం. కేసీఆర్‌ను తిరిగి తెచ్చుకోవాలనే ఆలోచన ప్రజల్లో కనిపిస్తోంది. ఉన్న హైదరాబాద్ నగరాన్ని ఉద్ధరించే పరిస్థితి లేదు..కానీ కొత్త నగరాన్ని కడతామని పోజులు కొడుతున్నారు. మున్సిపల్ శాఖ విషయంలో సీఎం రేవంత్ పూర్తిగా విఫలమయ్యారు అని కేటీఆర్ విమర్శించారు.

## ఫ్యూచరే కనిపించని ఫ్యూచర్ సిటీకి..
# ఫ్యూచర్ వెతికే పనిలో సీఎం: పట్లోళ్ల



**దశ , గచ్చిబౌలి:** ఫ్యూచరే కనిపించని ఫ్యూచర్ సిటీకి మెట్రో వేసే పనిలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని , ఐటి కారిడార్ మెట్రోని క్యాన్సిల్ చేయడం వల్ల ఈ రాష్ట్రానికి వచ్చిన లాభం ఒక్కటి చెప్పండి అని బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. సోమవారం బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా , మాజీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు కొలను ప్రదీప్ రెడ్డిల ఆధ్వర్యంలో రెండో దశ మెట్రోను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. నిరసన చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసారు. అరెస్ట్ చేసిన నాయకులను గచ్చిబౌలి, నార్సింగి పీఎస్ లకు తరలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మెట్రో కోసం ల్యాండ్ అక్విజేషన్ కూడా అయింది, వీళ్లు మొదలు పెట్టి ఉంటే ఈపాటికే రాజేంద్ర నగర్ వాళ్ళము మెట్రోలో తిరిగే వాళ్ళము అన్నారు. రాయదుర్గం మెట్రో వల్ల మూడు నియోజకవర్గాలకు మంచి జరుగుతుంది , హైదరాబాద్ పోవాలన్న, శంషాబాద్ పోవాలన్న మనం టాక్సీకే పోవాలన్నారు. రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన మరో రోజే ఈ మెట్రోను శాంక్షన్ చేయించి రెండో రోజే పనులు మొదలు పెడుతామన్నారు. మేము ఏం చేశామని ఇవ్వాళ మమ్మల్ని అరెస్ట్ చేశారు?, మాకు మెట్రో వచ్చే వరకు మేము ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు.

# సెప్టిక్ ట్యాంకులో పడి వ్యక్తి మృతి

**దశ, హయత్ నగర్:** హయత్ నగర్ డివిజన్ లోని కమర్షియల్ టాక్స్ కాలనీలో ఒక వ్యక్తి బతుకమ్మ పూలు తేవడానికి వెళ్లి... చెట్ల చాటున ఉన్న సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందిన ఘటన సోమవారం హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం శేరిగూడ గ్రామానికి చెందిన సుర్కంటి అశోక్ రెడ్డి (50) హయత్ నగర్ డివిజన్ లోని కమర్షియల్ టాక్స్ కాలనీలో నివాసముంటున్నాడు. మంగళవారం నిర్వహించే సద్దుల బతుకమ్మ కోసం పూలు తేవడానికి సోమవారం ఉదయం సమీపంలో ఉన్న ప్రదేశానికి వెళ్లాడు. పూలు తెంపుతున్న సమయంలో చెట్ల చాటున ఉన్న తెరిచి ఉన్న సెప్టిక్ ట్యాంక్ లో పడి ఊపిరి ఆడక మృతి చెందాడు. సాయంత్రం అయినా అశోక్ రెడ్డి ఇంటికి రాకపోవడంతో సెప్టిక్ ట్యాంక్ను. పరిశీలించగా, అశోక్ రెడ్డి కనిపించాడు. స్థానికుల సహాయంతో అశోక్ రెడ్డిని బయటకు తీయగా, అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ



తిరుమల్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి , కార్పొరేటర్ నవజీవన్ రెడ్డిలు వేర్వేరుగా మాట్లాడుతూ... అధికారుల నిర్లక్ష్యమే అశోక్ రెడ్డి మృతికి కారణమన్నారు. రెండు సంవత్సరాలుగా డ్రైనేజీ ఏర్పాటు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు.